క్లుప్తంగా

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న సుధాకర్ రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం లింగాపూర్ గ్రామంలో విలేజ్ డిలైట్ ఫోరమ్ ఆధ్వర్యంలో డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. ఏటీ అండ్ ఏ గ్లోబల్ కమ్యూనికేషన్స్, అమెరికా కార్పొరేట్ సంస్థ ద్వారా గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ మారెడ్డి సుధాకర్‌రెడ్డి మూడు కంప్యూటర్లను అందజేశారు. ఇందులో ఒకటి లింగాపూర్ గ్రామ పంచాయతీకి, మిగిలిన రెండు ప్రజల ప్రయోజనార్థం అందజేసినట్లు తెలిపారు. ఏటీఅండ్ టీ కంపెనీకి, సుధాకర్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్



ఇనుప చువ్వలు తేలిన వాటర్ ట్యాంక్ పిల్లర్లు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని కాసులాబాద్ రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంక్ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ కింది స్లాబుతో పాటు, పిల్లర్ల పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు తేలాయి. దీంతో అది ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదం జరగక ముందే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గుంతను పూడ్చిన యువత

సిద్దిపేటరూరల్: సిరిసిల్ల – సిద్దిపేట ప్రధాన మార్గం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ వద్ద ధ్వంసమైంది. హైవే కావడంతో వాహనాల రాకపోకలతో రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ రాయల్స్‌టీం యూత్ సభ్యులు గుంతను శనివారం పూడ్చివేశారు. స్థానికులు యువకులను అభినందించారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

దుబ్బాక టౌన్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యనందిస్తున్నామని దౌల్తాబాద్ మండల పరిధి శేరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, రవి, శ్రీనివాస్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని ప్రతిభావంతుడిగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. ఏటా 30 నుంచి 40 కొత్తగా చేరుతున్నారని తెలిపారు. ప్రతీ నెల తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

కల్లు గీత కార్మిక సంఘం ఎన్నికలు

హుస్నాబాద్: తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం మండల, పట్టణ కమిటీల ఎన్నికలు పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కొమురయ్య సమక్షంలో నిర్వహించారు. సంఘం హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా పచ్చిమట్ల రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షులుగా బండారి కిష్టయ్య గౌడ్, గాదగోని కొమురయ్య గౌడ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పూదరి రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కోయ్యడ శ్రీనివాస్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేటజోన్: సిద్దిపేట ఎన్జీవో భవన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. 2024–25 సంవత్సరానికి గాను అధ్యక్షుడిగా అయిత అంజయ్య ప్రధాన కార్యదర్శిగా కోమండ్ల విక్రమ్ రెడ్డి, కోశాధికారిగా కల్లెపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పోచయ్య, కృష్ణమూర్తి సహాయ కార్యదర్శులుగా బాలకిషన్, శ్రీనివాస్ రాజు, ఆర్థిక సంఘం సభ్యులుగా రాంరెడ్డి, శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా సత్యనారాయణ, రాజేందర్, భూమయ్య, రామచంద్రారెడ్డి, శ్రీనివాసు ఎన్నికయ్యారు.

డేటా గోప్యత పాటించాలి

సిద్దిపేట కమాన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రజలు, యువత సోషల్ మీడియా డేటా గోప్యత సెట్టింగ్స్ ఉపయోగించాలన్నారు. ఉపయోగంలోలేని సెల్‌ఫోన్లు, కంప్యూటర్లను లాగ్ అవుట్ చేయాలన్నారు. అపరిచితులు పంపే మెసేజ్‌లు, లింకులను క్లిక్ చేయొద్దన్నారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు, పిన్ నంబర్లు తెలపొద్దని సూచించారు. వాట్సాప్‌లో డబ్బులు అడిగితే నమ్మకూడదన్నారు.

వర్షంతో రోడ్లన్నీ చిత్తడి

- బురదమయంగా మట్టిరోడ్లు
- రోడ్ల మరమ్మతులతో ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న పట్టణ ప్రజలు
- చర్యలు చేపట్టాలని డిమాండ్



కళ్లకుంట బస్తీ దవాఖాన ఎదుట నిలిచిన వర్షపు నీరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వర్షాలకు జిల్లా కేంద్రంలోని పలు కాలనీల మట్టిరోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. సిద్దిపేటలో ఇప్పటికీ పలు వీధుల్లో మట్టిరోడ్లే ఉన్నాయి. జిల్లా కేంద్రంకావడంతో పట్టణ వైశాల్యం పెరుగుతోంది. పట్టణ శివారులో నూతన కాలనీలు వెలుస్తున్నాయి. పట్టణంలోని కొన్ని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రాత్రి వేళలో ఆ దారుల్లో రాకపోకలు సాగించాలంటే నానా అవస్థలుపడుతున్నారు. వర్షాలకు చిన్నపాటి నీటికుంటలుగా మారుతున్నాయి. ముఖ్యంగా కళ్లకుంట కాలనీ, కేసీఆర్ నగర్, మైత్రివనం, కార్తికేయకాలనీ, మహాశక్తినగర్, ప్రశాంత్‌నగర్, సీతారాంనగర్, ఇందిరానగర్, గాడిచెర్లపల్లి, సంతోష్‌నగర్, ప్రియదర్శిని, సందీప్‌నగర్ కాలనీల్లో జనాభా ఎక్కువగా ఉంది. అక్కడ చిన్నాపాటి చేతి పరిశ్రమలు ఉన్నాయి. ఈ కాలనీల్లో సీసీ రోడ్లు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. పలు కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలు, సీసీ రోడ్ల ధ్వంసం, మరమ్మతుల కారణంగా వర్షపునీరు గుంతల్లో నిలుస్తోంది. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీసీ రోడ్లు వేయాలి



మా కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు లేకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్లపై ప్రయాణించలేకపోతున్నాం. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళలో కాలనీ వాసులు రోడ్లపై రావాలంటే భయపడుతున్నారు. అధికారులు అధికారులు స్పందించి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి.

– జైపాల్‌రెడ్డి, సంతోష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్

అధికారులు స్పందించాలి



సందీప్‌నగర్ కాలనీ నూతనంగా ఏర్పడింది. దీంతో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. సీసీ రోడ్లు లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఉదయం, సాయంత్రం అవస్థలుపడుతున్నారు. వర్షం కురిస్తే మట్టి రోడ్లు గుంతలమయంగా మరుతున్నాయి.

– రాజు, సందీప్‌నగర్ కాలనీ

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



బ్యాగులు పంపిణీ చేస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థ పటిష్టత కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన, మెరుగైన సౌకర్యాలు లభిస్తున్నాయన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాలలు పటిష్టమవుతాయన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు ప్రమీల, ప్రభాకర్ దంపతుల సౌజన్యంతో 135 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వరప్రసాద్, యాదయ్య, లలిత, నాగమణి, వాణి, అమ్మ కమిటీ చైర్మన్ భారతమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతి లాభదాయకం



వెదజల్లే పద్ధతిని వివరిస్తున్న ఏఈఓ శ్రీలత

అక్కన్నపేటల(హుస్నాబాద్): వెదజల్లే పద్ధతిలో వరిసాగు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈఓ) కరంటోతు శ్రీలత అన్నారు. మండలంలోని జనగామ రైతు పూదరి వీరయ్య వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తున్న వరి పంటను శనివారం పరిశీలించారు. అలాగే వానాకాలంలో ఇతర రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూలీలు దొరక్క ఇబ్బంది పడే సందర్భాల్లో ప్రత్యామ్నాయంగా వెదజల్లే పద్ధతిపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఫలితంగా కూలీల ఖర్చు మిగలడమే కాకుండా పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందన్నారు. నాట్లు వేయడం ప్రస్తుతం పాత తరానికే పరిమితమైందని, నేటి మహిళలు నాట్లు వేసే పద్ధతిపై ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో కూలీల కొరత ఇబ్బందికరంగా మారందన్నారు. వెదజల్లే పద్ధతిలో ఎకరానికి 10 నుంచి 15 కిలోల విత్తనం సరిపోతుందన్నారు.

గోరింటాకు సంబురాలు



తిప్పారం ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాలలో ఆషాఢ మాసం సందర్భంగా శనివారం గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. సంబరాల్లో విద్యార్థుల తల్లులు, మహిళా ఉపాధ్యాయులు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. హెచ్‌ఎం రవీందర్ మాట్లాడుతూ దేశ సంస్కృతిలో మహిళలు గోరింటాకు పెట్టుకుంటారన్నారు. దాని విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఏఏసీసీ చైర్ పర్సన్ రేణుక, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



ఆలయ నిర్వాహకులను సన్మానిస్తున్న ఏఎస్‌ఐ జగదీశ్వర్

మద్దూరు(హుస్నాబాద్): నేరాల నియంత్రణ, కేసుల పరిశోధనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఏఎస్‌ఐ జిల్లా జగదీశ్వర్ అన్నారు. మండలంలోని రేబర్తి గ్రామంలోని పెద్దమ్మగుడి, దూల్మిట్ట మండలంలోని దుర్గమ్మ గుడిలో ఇటీవల చోరీలు జరగడంతో చేరాల్య సీఐ శ్రీను ఆలయ నిర్వాహకులతో మాట్లాడి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీంతో శనివారం ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులను ఏఎస్‌ఐ సన్మానించారు.

మెడికల్ బిల్లులు విడుదల చేయాలని వినతి

సిద్దిపేటకమాన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్‌ను రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కమిటీ నాయకులు శనివారం కలిశారు. జిల్లాలోని ఉపాధ్యాయుల మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో విడతల వారిగా ఆరోగ్య సంబంధిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

సమస్యలపై చర్చించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం విద్యార్థి సంఘాలతో చర్చించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అము దాల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్ శనివారం కోరారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రాథమిక విద్యను అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందించాలని, ప్లేస్కూల్‌గా అంగన్ వాడీ కేంద్రాలను మార్చాలనే నిర్ణయం సరికాదన్నారు. నర్సరీ నుంచి మూడో తరగతి వరకు విద్యను అంగన్‌వాడీల ద్వారా అందించాలని నిర్ణయిస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ప్రాథమిక విద్యలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు.

బీమా చెక్కు అందజేత

బెజ్జంకి(సిద్దిపేట): సహకార సంఘం సభ్యురాలు వాడె సుమలత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని బెజ్జంకి సహకార సంఘం చైర్మన్ తన్నీరు శరత్‌రావు శనివారం పరామర్శించి, సంఘం నుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘానికి చెందిన 186 మంది రైతులకు ప్రభుత్వం రూ.1,17,66,963 రుణమాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో సీసీ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, సూపర్‌వైజర్ దుర్గం, సీఈఓ వాసు, సంఘం వైస్ చైర్మన్ బండి రమేష్, నరేష్‌బాబు, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల కార్యవర్గం

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణ కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముత్యాల సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చింతల బాలు, కోశాధికారిగా బాలరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, బైరీ శేఖర్, గ్యాదరి మల్లేష్, సంయుక్త కార్యదర్శిగా అంజియాదవ్, కార్యవర్గ సభ్యులుగా బైరి శ్రీధర్ యాదవ్, మల్లేష్, సాకి రఘు, గౌరవ సలహాదారులుగా కోట వేణుగోపాల్, గ్యాదరి భూమలింగం, భాస్కర్ రెడ్డి, మల్లికార్జున్ యాదవ్, ఎస్.శ్రీనివాసచారి ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదు

- జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి

హుస్నాబాద్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కులేదని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చెర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం నియోజకవర్గ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. మొదటి విడతగా రూ.లక్ష లోపు రుణాలు నేరుగా రైతుల ఖాతాకు జమచేయడం సాహోసోపేత నిర్ణయమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.లక్ష జమ చేయకుండా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయలేని బీజేపీ ప్రభుత్వం బడా వ్యాపారులకు రూ.లక్షల కోట్లు మాఫీ చేసిందని విమర్శించారు. రైతుల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రుణమాఫీ నిర్ణయాన్ని బీజేపీ, బీఆర్‌ఎస్ హర్షించకుండా విమర్శించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులుపాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి



జగదేవ్‌పూర్‌లో అమ్మ మాట అంగన్‌వాడి బాట ర్యాలీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మూడేళ్లు నిండిన పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు కాకుండా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సీడీపీఓ సరిత తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట అంగన్‌వాడి బాట ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు మూడేళ్లు నిండగానే తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. కేంద్రంలో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తామన్నారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భవానీ, రజిత, అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బంగారులొద్దితండాలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): మూడేళ్ల చిన్నారులను అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పాలని అంగన్‌వాడీ టీచర్ సరోజన అన్నారు. అక్కన్నపేట మండలం ముంపు గుడాటిపల్లి పరిధిలోని చింతల్‌తండా, రామవరం గ్రామ పరిధిలోని బంగారులొద్దితండాలో శనివారు అమ్మ మాట అంగన్‌డీ బాటపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లలకు విద్యపై ఆసక్తి పెరగాలంటే అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు.

దళితుల సంక్షేమంపై చర్చించాలి

గజ్వేల్‌రూరల్: దళితుల సంక్షేమం, అభివృద్ధిపై త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి శనివారం కోరారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ అమలు చేయాలని, అంబేడ్కర్ అభయ హస్తం పథకం మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లను వేర్వేరుగా అమలు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. పదేళ్లుగా రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దళిత బహుజనులు అనర్హులుగా మారనున్నారని, వెంటనే కొత్త రేషన్‌కార్డుల జారీ చేయాలన్నారు. రైతు రుణమాఫీకి పాస్‌బుక్ ప్రామాణికంగా వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఆయా శాఖలకు మంత్రులను వెంటనే కేటాయించాలన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రతీ స్కూల్‌లో చేతుల పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో సపారి అప్నే బీమారి భగావో కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ పిల్లలు, పట్టణ ప్రజలందరు భోజనం చేయక ముందు, చేసిన తర్వాత, మల మూత్ర విసర్జన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కో ఆప్షన్ సభ్యులు శంకర్ రెడ్డి, అయూబ్, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల సంబురం



అమ్మవారికి వెండి కిరీటం అందిస్తున్న కుంట నారాయణ కుటుంబ సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): డప్పు చప్పుళ్లు, బైండ్ల వారి ఆటపాటలు, శివసత్తుల శిగాలు, యువకుల నృత్యాల నడుమ మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శనివారం మహంకాళమ్మ బోనాల జాతర అంబరాన్నంటింది. మున్నూరు కాపు సంఘం, మహంకాళి ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు మంగళ హారతులతో సామూహిక పూజలు నిర్వహించి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. కుంట నారాయణ కుటుంబ సభ్యులు అమ్మవారికి వెండి కిరీటాన్ని బహూకరించారు.

దుబ్బాక పట్టణంలో..

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే వేద పండితులు వేలేటి జయరామ శర్మ, రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం డప్పుచప్పుల మధ్య పోతురాజు విన్యాసాలతో ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు.

ప్రపంచ ఆర్థిక సంస్థగా బరోడా బ్యాంక్

- వర్గల్ బ్రాంచి మేనేజర్ మౌనిక



బ్యాంకు ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది

వర్గల్(గజ్వేల్): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖాతాదారులకు మెరుగైన సేవలతో ప్రపంచ ఆర్థిక సంస్థగా బరోడా బ్యాంక్ ఎదిగిందని వర్గల్ బ్రాంచి మేనేజర్ మేనేజర్ మౌనిక అన్నారు. బరోడా బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం వర్గల్ శాఖలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా గ్రామీణ, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. చిరు వ్యాపారులు, రైతులు, వ్యాపారులను ఆర్థికంగా శక్తివంతం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, గృహ నిర్మాణం, వాహనాలు, చిరు వ్యాపారం తదితరాలకు రుణసదుపాయం ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు లకావత్ మల్సూర్, దొడ్ల వెంకటేష్, బోనగిరి రాకేష్, సిబ్బంది స్వాతి, ప్రియాంక, ఖాతాదారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): రైతుబీమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూన్ 28 తేదీ లోపల పట్టాదార్ పాస్‌బుక్ పొందిన వారు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో చేసుకోని వారు చేసుకోవచ్చాన్నారు. రైతుబీమాకు దరఖాస్తు తోపాటు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వాలని సూచించారు.

◆ రుణమాఫీ సంబరాలు

కోహెదరూరల్(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో హుస్నాబాద్ మాజీ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బొబ్బల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బత్తుల రాజు, ముల్కల అరవింద్, వెంకటాచారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ గ్రామ అధ్యక్షుడి నియామకం

కోహెదరూరల్(హుస్నాబాద్): జాతీయ మాల మహానాడు మండలంలోని సముద్రాల గ్రామ నూతన అధ్యక్షుడిగా ఆరె ఎల్లయ్యను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నరాజు తెలిపారు. శనివారం గ్రామంలో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో సముద్రాల గ్రామ కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఆరే శ్రీనివాస్, ఆరే బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కిషోర్, సంయుక్త కార్యదర్శిగా ఆరే శ్రవణ్, కోశాధికారిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ఆరే శరత్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

◆ రుణమాఫీ నిబంధనలు తొలగించండి

కోహెద(హుస్నాబాద్): రూ. 2 లక్షల రుణమాఫీ నిబంధనలు తొలగించాలని కోహెడ ఫ్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. రైతు రుణ మాఫీ జాబితా గందరగోళంగా ఉందన్నారు. రైతులందరికి రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి షరతులతో కూడిన రుణమాఫీని ప్రకటించి రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు.

◆ స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం తల కొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 125 మందికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణ్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దుర్గాప్రసాద్, మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ విద్యార్థికి సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల గ్రామానికి చెందిన సాయివరుణ్ ఎన్‌ఎంఎంఎస్‌లో రాష్ట్రస్థాయిలో సీటు సాధించాడు. దీంతో అక్షరసేద్యం ఫౌండేషన్ నిర్వాహకులు శనివారం అతడిని సన్మానించారు. అలాగే స్టడీ చెయిర్, ప్యాడ్ తదితర వస్తువులు బహూకరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ దుర్గయ్య, హైస్కూల్ హెచ్‌ఎం రాజశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానానికి చేరాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ విజ్ఞానాన్ని అందించండి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే విధంగా అందరూ చొరవ చూపాలని శ్రీ సరస్వతి శిశుమందిర్ ప్రిన్సిపాల్ హరిణ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలఓ వ్యాసపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గోరింటాకు ప్రాముఖ్యతను తెలియజేశారు.

◆ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు శశిధరశర్మ పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ (ఏటిగడ్డ కిష్టాపూర్) జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎం కరీముద్దీన్ ఆధ్వర్యంలో శనివారం వ్యక్తిత్వ వికాసం కార్యక్రమం నిర్వహించారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన

కోహెద(హుస్నాబాద్): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాలలో ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపరచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. అత్యవసర పరిస్థితులలో డయల్ 100కు లేదా షీటీమ్ 87126 67434 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, పోలీస్, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.